క్లుప్తంగా

సైనికులకు మ్యాప్ రీడింగ్ దిక్సూచి



క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇస్తున్న ఎన్‌సీసీ అధికారులు

కూడేరు: దేశ సరిహద్దుల్లో సైనికులకు మ్యాప్ రీడింగ్ దిక్సూచీలా పని చేస్తుందని సీఏటీసీ-2 ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ-2 శిక్షణ ఇస్తున్నారు. శిక్షణా తరగతుల్లో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, సికింద్రాబాద్, కర్నూల్, గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అనంతపురం గ్రూపులకు చెందిన 550 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఆదివారం క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్‌పై అధికారులు శిక్షణ ఇచ్చారు. శత్రు సైన్యం ఏ దిక్కున ఉంది.. వారిపై దండెత్తడానికి ఏ వైపు నుంచి వెళ్లాలో మ్యాప్ రీడింగ్ ఉపయోగ పడుతుందని ఆయన వివరించారు. మ్యాప్ రీడింగ్ బాగా గీసిన క్యాడెట్లను కమాండర్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

260 పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకా



ముద్ద చర్మవ్యాధి సోకిన పశువులకు టీకా వేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని సంతే కొండాపురం, పాలవెంకటాపురం, పంచాయతీల్లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 260కి పైగా పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకా వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈవ్యాధి ద్వారా పశువులు మేతమేయవన్నారు. పశువుల చర్మంపై దద్దుర్లు కట్టి , చర్మం ముద్దగా మారుతుందన్నారు. ఇలాంటి లక్షణాలు పశువుల్లో కనిపిస్తే వెంటనే టీకా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు సుధీర్ , లింగన్న, రమణనాయక్, భానుప్రియ, గీత, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి




కొమ్మల కత్తిరింపుపై అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారులు

కుందుర్పి: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని ఉద్యాన శాఖ అధికారి గౌషియా సూచించారు. ఆదివారం మండలంలోని ఎస్‌మల్లాపురంలో మామిడి తోటల్లో కొమ్మల కత్తిరింపుపైన, సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యాన అధికారి మాట్లాడుతూ మామిడి రైతులు కోతల అనంతరం యాజమాన్య పద్ధతులు పాటిస్తూనే సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. మామిడి చెట్ల కొమ్మల కత్తిరింపులో జాగ్రత్తలు పాటించాలని, గత ఏడాది కాత రాని మామిడి చెట్లను మాత్రమే కత్తిరించాలన్నారు. సరైన విధానంలో కత్తిరింపులు చేసినప్పుడే చీడపీడలను నివారించొచ్చని, మంచి దిగుబడి కూడా వస్తుందన్నారు. ఎండిన కొమ్మలు, మోడుబారిన చెట్లను తొలగించాలని, చెట్ల మొదలపై సూర్యరశ్మి పడేలా కత్తిరింపులు చేయాలన్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామం నుంచి కేపీ దొడ్డికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఉపాధి ఏపీఓ సురేశ్ తెలిపారు. కానుగ, వేప, సుంకేసుల మొక్కలను నాటుతున్నట్లు ఆయన తెలిపారు.


త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



మోపిడిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ: ఈనెల 21న గురుపౌర్ణమిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత ప్రచారం చేశారు. మండల పరిధిలోని మోపిడి గ్రామంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు, చందు, కృష్ణ, ఉమాదేవి, చిన్న, దేవిక, ఎల్లమ్మ, సమతి, సువర్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గురుపౌర్ణమికు ఎంతో విశిష్టత ఉందన్నారు.

ధరల దడ



- పప్పుదినుసులు కొనలేక, తినలేక సామాన్యుల అవస్థలు
- భారీగా పెరుగుతున్న రేట్లు
- కిలో కంది పప్పు రూ.180

రాయదుర్గం: నిత్యావసరాల ధరలు ఆకాశనంటుతున్నాయి. పప్పుదినుసుల ధరలు మండుతున్నాయి. బియ్యం నుంచి పప్పుదినుసులతో పాటు చివరకు ఆవాలు కూడా కొనలేని పరిస్థితికి చేరాయి. కందిపప్పు ధర కొండెక్కితే అదేబాటలోనే శనగపప్పు, మినపప్పు, వేరుశనగ విత్తన ధరలూ పయనిస్తున్నాయి. నూనె ధరలు సలసల కాగుతుంటే, గ్యాస్ బండ భారం మోయలేని స్థితికి చేరింది. ఇలా అన్ని ధరలు రెట్టింపు కావడంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో రెండు అర్బన్ ప్రాంతాలు 15 మండల కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 2,01,768 కుటుంబాలు ఉండగా, 6,90,900 మంది జనాభా ఉన్నారు. ఇందులో 70 శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఉండటం విశేషం. రెండు నెలలతో పోలిస్తే నలుగురు సభ్యులున్నా కుటుంబానికి నెల వారీ ఖర్చు రూ.15 వేల నుంచి రూ.20వేలకు పెరిగింది. నిత్యావసరాల ధరలతో పాటు కూరగాయాలు, ఇంటి అద్దె, ద్విచక్ర వాహనం పెట్రోల్, విద్యుత్, నీటి బిల్లు, సెల్‌ఫోన్ రీచార్జ్ తదితరాలు కలుపుకుంటే గతంలో నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఖర్చయ్యేది. ప్రస్తుతం రూ.20 వేలు దాటుతోంది.

రూ.180కి చేరిన కందిపప్పు

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా పప్పు దినుసుల ధరలు మార్కెట్లో అమాంతం పెరిగిపోయాయి. దేశీయ పప్పుధాన్యాల ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో కందిపప్పు కిలో రూ.180 కి చేరింది. మినపప్పు రూ.130, పెసరపప్పు రూ.135, చక్కెర రూ.45, నూనె రూ.118 నుంచి రూ.130, బెల్లం రూ.70, టీ పొడి రూ.900, ఉప్పు రూ.30 ఇలా ఏ వస్తువు కొన్నా ధరలు 'ధర'దడలాడిస్తున్నాయి. ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం పప్పు దినుసులపై 15 శాతం దిగుమతి సుంకం ఎత్తేసింది. అప్పట్లో ధరలు కాస్త నిలకడగా ఉన్నాయి. ఆ తర్వాత మళ్లీ ధరలు మంట పుట్టిస్తున్నాయి.

కూరగాయలదీ అదే దారి

నిత్యావసరాలే కాదు.. కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. ఏది కొనాలన్నా కిలో రూ.40 పైమాటే. ఉల్లి కన్నీరు పెట్టిస్తుంటే, వెల్లుల్లి కూడా తానేమీ తక్కువ కాదన్నట్లు కొండెక్కి కూర్చుంది. దీంతో కిలో కొనాలనుకునే వాళ్లు అర కిలో లేదా కాల్ కిలోకే సరిపెట్టుకుంటున్నారు. ధరలకు కళ్లెం వేయకపోతే సామాన్యులు కొనడం, తినడం రెండూ మానేస్తారు.

ధరలన్నీ పెరిగాయి



నిత్యావసరాలతో పాటు కూరగాయాల ధరలన్నీ విపరీతంగా పెరిగాయి. మా ఇంట్లో ముగ్గురం ఉన్నాం. నెలకు అన్ని ఖర్చులతో కలిపి రూ.15 వేలు దాటుతోంది. పప్పుదినుసులైతే కొనడం మానేశాం. కందిపప్పు కిలో రూ.170 నుంచి రూ.180 ఫలుకుతోంది. ఆవాలు, జీలకర్ర, సాస్‌ల ధరలు రెట్టింపయ్యాయి. నియంత్రించేలా అధికారులు కృషి చేయాలి.

– కే యశోద, గృహిణి, అడిగుప్ప, గుమ్మఘట్ట మండలం

ధరలు చూసి దడ పుడుతోంది



మార్కెట్లో ధరలు చూస్తే సామాన్యులకు దడ పుడుతోంది. నూనె ధరలు పెరిగిపోయాయి. కందిపప్పు ధర కొండెక్కి కూర్చుంది. నిత్యావరాల ధరలు ఇలా ఉంటే కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయి. ఏది కొనాలన్నా కిలో రూ.40 పై మాటే. ఆకు కూరలైతే రూ.20 ఇచ్చినా రెండు కట్టలు కూడా రాని పరిస్థితి. పేద, మధ్య తరగతి కుటుంబాలు కొనలేక అవస్థలు పడుతున్నారు.

– మూడ్లప్ప, తాళ్లకెర

నేడు మాజీ ఎంపీ రంగయ్య రాక

కుందుర్పి: మండలంలోని మలయనూరు గ్రామంలో సోమవారం నిర్వహించనున్న కార్యకర్తల సమావేశంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు శెట్టూరు మండల కంబాలపల్లి, 5 గంటలకు కుందుర్పి మండలం మలయనూరులో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎన్నికల తర్వాత టీడీపీ నాయకులు దాడుల్లో గాయపడిన వారిని కూడా మాజీ ఎంపీ పరామర్శిస్తారన్నారు.

నాగమల్లి ఓబులేసుకు సన్మానం



నాగమల్లి ఓబులేసును సత్కరిస్తున్న జిల్లా రచయితల సంఘం సభ్యులు

ఉరవకొండ: ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయభవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉరవకొండకు చెందిన జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసును ఆదివారం సన్మానించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు కంబదూర్ షేక్‌నబీరసూల్, ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం , కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజుల చేతుల మీదుగా జ్ఞాపికను అందించారు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వ

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేద్దామని యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం తన స్వగృహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్‌మీడియా కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేశారు. మెట్టు విశ్వ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సమానమేనన్నారు. ఓడినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాతీర్పును గౌరవిస్తూ, వారి పక్షాన పోరాటం సాగిద్దామని ధైర్యం చెప్పారు. ప్రతి ఊర్లోనూ వైఎస్సార్‌సీపీకి బలమైన కేడర్ ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 40 శాతం మందికిపైగా ఫ్యాన్ గుర్తుపై ఓటేశారని, వారందరికీ పార్టీ తోపాటు మెట్టు కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుదని భరోసా ఇచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారని, త్వరలో మరిన్ని కార్యక్రమాలతో ప్రజల వద్దకు వస్తారన్నారు. గ్రామాల్లో జరిగిన దాడులు, ఘర్షణలపై కొందరు మెట్టు విశ్వ దృష్టికి తీసుకెళ్లారు. కక్షపూరిత రాజకీయాలు సరైంది కాదన్నారు.

వైఎస్ జయంతి వేడుకలను విజయవంతం చేద్దాం..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని యువ నాయకుడు మెట్టు విశ్వ పిలుపునిచ్చారు.



చికిత్స పొందుతున్న అనిల్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మెట్టు విశ్వ, వైఎస్సార్‌సీపీ నాయకులు

పట్టణంతో పాటు అన్ని మండలాల్లోనూ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించాలన్నారు.

దాడిలో గాయపడిన యువకుడికి పరామర్శ..

డి హీరేహాళ్ మండలం మురడిలో దాయాదుల ఘర్షణలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు అనిల్‌కుమార్‌ను మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటాం, అధైర్య పడొద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్యాధికారిని కోరారు. విశ్వ వెంట మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ భోజరాజ్‌నాయక్, రాయదుర్గం మండల కోఆప్షన్ సభ్యుడు దిలవర్‌బాషా, మురడి మురళీమోహన్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అర్చకులకు కోర్టులో ఊరట

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరిలో అంజనేయ స్వామి ఆలయ అర్చకులకు కోర్టులో ఊరట లభించింది. అర్చకులు 25.40 ఎకరాల మాన్యం భూమిని సాగుచేసుకుంటున్నారు. మూడేళ్ల క్రితం వారు వ్యవసాయ శాఖ అధికారులతో కౌలు రైతులుగా నమోదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మాన్యం భూమిని కౌలుకు చేస్తున్నట్లు ఎలా నమోదు చేయించుకుంటారని నిలదీశారు. పూజలు చేయకూడదని అభ్యంతరం తెలపగా అర్చకులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. వారికి కోర్టులో ఊరట లభించింది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కంబదూరు: కంబదూరు శివారులోని మేళ్లకుంట రహదారిలో పంచాయతీ తాగునీటి పథకం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు శనివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. సుమారు రూ.50 వేల విలువైన 80 కిలోల కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. అందులో ఉన్న కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై ఆదివారం గ్రామ పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో ఆదివారం సాయంత్రం తాగునీటి కోసం మహిళలు ఆందోళన చేశారు. ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిపై మహిళలు ఖాళీబిందెలతో బైఠాయించి, నిరసన తెలియజేశారు. మహిళలు మాట్లాడుతూ గ్రామంలోని మెయిన్‌రోడ్‌లోని మారెమ్మ ఆలయం వద్ద ఉన్న కాలనీవాసులకు తాగునీరు సరఫరా కావడంలేదన్నారు. పోలీసులు అక్కడికు చేరుకొని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నచ్చజెప్పారు.

త్వరలో ఏజీ ఆడిట్ ప్రారంభం

వజ్రకరూరు: స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో అధికారులు రికార్డులు సిద్ధం చేస్తున్నారు. త్వరలో అకౌంటెంట్ జనరల్ ఆడిట్ (ఏజీ ఆడిట్) ప్రారంభం కానుంది. 2019 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టిన పనుల ఖర్చులు తదితర వాటిపై ఆడిట్ జరనున్నట్లు ఏపీఓ లక్ష్మీకాంత బాయి తెలిపారు. మొత్తం 18 శాఖలకు సంబంధించి ఆడిట్ ఉంటుందన్నారు.

విద్యుత్ షాక్‌తో మూగజీవాలు బలి

రాయదుర్గం రూరల్: మండలంలోని బీఎన్ హళ్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలోని విద్యుత్ డీపీ వద్ద నేలకు తరచూ అర్త్ రావడంతో మూగజీవాలు బలి అవుతున్నాయి. ఆదివారం విద్యుత్ స్తంభం సమీపంలోకి వెళ్లిన పెంపుడు కుక్క షాక్ కు గురై మృతిచెందిందని గ్రామస్తులు వన్నూరప్ప, ఆంజనేయులు, దాసు, శివన్న, చంద్రప్ప, సరస్వతి తెలిపారు. గతంలో ఓ పెంపుడు కుక్కతో పాటు , గేదె దూడ కూడా విద్యుతాఘాతానికి బలైనట్లు తెలిపారు. ఒకే స్తంభంలో పై భాగాన 33కేవీ లైను, దానికింద 11 కేవీ లైను ట్రాన్స్‌ఫార్మర్ ఉందన్నారు. దీంతో వాటి అర్త్ నేలలో ఇవ్వడం వల్ల తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయంటున్నారు. 33కేవీ లైను రాయంపల్లి సమీపంలోని గవిశిద్దేశ్వర స్టీల్ ఫ్యాక్టరీకి వెళ్లిందన్నారు. విద్యుత్ స్తంభం చుట్టూ సుమారు 3 నుంచి 5 అడుగుల వరకు విద్యుత్ ప్రసారం కావడంతోనే మూగజీవాలు బలి అవుతున్నాయని అన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలకు తరలిరండి



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నేత ఉమా

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్ జయంతి వేడుకలకు పార్టీ నాయకులు,కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎంపీ కళ్యాణదుర్గం సమన్వకర్త తలారి రంగయ్య, పార్టీ నేత ఉమా కోరారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణంలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య, ఉమా మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు పట్టణంలోని వైఎస్ఆర్ పార్కు వద్ద ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, దొడగట్ట నారాయణ, తలారి సత్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లులో..

విడపనకల్లు: మండల కేంద్రంలో సోమవారం జరగనున్న దివంగత సీఎం వైఎస్సార్ జయంతి వేడుకలకు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఎంపీపీ కరణం పుష్పావతి, నాయకులు కరణం భీంరెడ్డి, మండల కన్వీనర్ బసన్న కోరారు.

ఉరవకొండలో నేడు వైఎస్సార్ జయంతి

ఉరవకొండ: పట్టణంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని సోమవారం జరగనున్న పలు సేవా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొంటారని పార్టీ పట్టణ కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు కవితా హోటల్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం ఉంటుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పార్టీ కార్యాలయానికి ఉదయం 9 గంటలకు చేరుకోవాలని కోరారు.

నేడు వజ్రకరూరులో..

వజ్రకరూరు: మండల కేంద్రంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం వజ్రకరూరు బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ ఉంటుందన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



రాయదుర్గం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు వైఎస్సార్ జయంతి వేడుకలను పండుగా నిర్వహిద్దామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, పార్టీ నాయకత్వం మొత్తం భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఉదయం 9 గంటల నుంచే పట్టణంలో పలు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

ఫర్టిలైజర్స్ డీలర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



డీలర్ల కమిటీ అధ్యక్షుడు చాంద్‌బాషా



ఉపాధ్యక్షుడు శరత్‌చంద్ర

కణేకల్లు : మండల ఫర్టిలైజర్స్ డీలర్ల అసోషియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన డీలర్ల సమావేశంలో డీలర్ల కమిటీ అధ్యక్షులుగా రైతు డిపో ఫర్టిలైజర్‌షాపు యజమాని చాంద్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శరత్ చంద్ర, కార్యదర్శిగా తుకారాం, సహాయ కార్యదర్శిగా అరుణాచలం,గౌర వాధ్యక్షుడిగా మహేష్‌గుప్తాను ఎన్నుకున్నారు.

యువతి కనిపించలేదని ఫిర్యాదు

బెళుగుప్ప: తమ కుమార్తె కనిపించలేదని మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన కృష్ణయ్య నాగమణెమ్మ దంపతులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కృష్ణయ్య మాట్లాడుతూ శనివారం రాత్రి తన కుమార్తె బంధువులతో కలిసి శ్రీరంగాపురం నుంచి తగ్గుపర్తి గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లిందన్నారు. అక్కడి నుంచి కనిపించలేదన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

నేటి నుంచి ఉచిత ఇసుక విధానం అమలు

- జుంజురాంపల్లి డంపింగ్ యార్డును పరిశీలించిన ఆర్డీఓ సుస్మితారాణి

రాయదుర్గం రూరల్: ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఉచిత ఇసుక నూతన విధానాన్ని సోమవారం నుంచి అమలు చేస్తున్నట్లు ఆర్డీఓ సుస్మితారాణి తెలిపారు. మండలంలోని జుంజురాంపల్లి ఇసుక రీచ్ వద్ద ఉన్న ఇసుక డంపింగ్ యార్డును జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, అనంతపురం ఆర్డీఓ సురేష్ నాయుడుతో కలిసి ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జుంజురాంపల్లి ఇసుక రీచ్ వద్ద 58,110 మెట్రిక్ టన్నుల ఇసుక డంపింగ్ సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం ఇసుక ఉచితమేనని, టన్ను ఇసుకకు లోడింగ్, సీనరీజ్ చార్జీలతో కలిపి రూ.195 మాత్రమే వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక వ్యక్తికి రోజుకు 20 టన్నుల వరకు ఇసుకను పొందే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇసుక కావాల్సిన వారు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, డెలివరీ చిరునామా తప్పనిసరిగా అందించాలన్నారు. డిపో నుంచి డెలివరీ చార్జీలు కి.మీ. ప్రకారం వాహనయజమానులకు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 6 గంల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, వీఆర్‌ఓ భీమప్ప, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామసర్పంచ్ వన్నూరుస్వామి, మాజీ ఎంపీటీసీ లచ్చన్న , గ్రామస్తులు పాల్గొన్నారు.



జుంజురాంపల్లి ఇసుక రీచ్ వద్ద ఉన్న డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ సుస్మితారాణి

అనారోగ్యంతో వృద్ధురాలి మృతి

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చుంచుల నాగప్ప చిన్నమ్మ చుంచుల లక్ష్మమ్మ (75) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. లక్ష్మమ్మ మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పూలమాలు ఉంచి, నివాళులర్పించారు. కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి భోజరాజ్ నాయక్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, కోఆప్షన్ సభ్యుడు దిలవర్ బాషా, నాయకుడు మురడి మురళీమోహన్‌రెడ్డి, బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాల యువత పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఉరవకొండ: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న దండోరా స్థూపం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల రవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా నాయకులు రాజు మాట్లాడుతూ దళితులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో దండోరా డివిజన్ అధ్యక్షులు రాయంపల్లి వెంకటేష్, తాలుకా అధ్యక్షులు చెన్నప్ప, ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల సురేష్, మోపిడి విజయ్, రామాంజనేయులు, గంగాధర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పాలు, పండ్లు పంపిణీ

ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో మాదిగ ఉద్యోగ సంఘం అధ్వర్యంలో పాలు, పండ్లు అందించారు. ఉద్యోగ సంఘం నాయకులు మీసుగ భాస్కర్‌బాబు, సాకే భాస్కర్, చాపిరి ఎర్రిస్వామి, సింగాడి దుర్గాప్రసాద్ మాట్లాడారు. మందకృష్ణ దళితుల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యల్లన్న, విజయ్, సోము, రాజేష్ పాల్గొన్నారు.



ఉరవకొండ, వజ్రకరూరులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని దాసంపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు దాసంపల్లి రవి, హనుమంతరాయుడు, బాబూజీ, ఆర్కే రాజు, తిమ్మరాయుడు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ 59వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ 1994 జూలై 7న ఎమ్మార్పీఎస్‌ను 20 మంది యువకులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సీ కులాల ఉమ్మడి రిజర్వేషన్లలో మాదిగ, ఇతర ఉపకులాలకు అన్యాయం జరుగుతోందని, ఒకే కులం సింహభాగం అవకాశాలను అనుభవిస్తోందని, ఎస్సీలందరికీ రిజర్వేషన్లు సమానంగా అందాలంటే ఏబీసీడీ వర్గీకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షుడు బెంజిమెన్, జిల్లా కార్యదర్శులు సుకుమార్,సురేష్, జనసేన కన్వీనర్ అచ్చనాల కేశవ్, జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, కురుబ సంఘం నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.